సాక్షి
ఖమ్మం
ఆదివారం । 5 । నవంబర్ । 2023



.. అవగాహన కలిగి ఉండాలి

పోలింగ్ రోజున నిర్వర్తించాల్సిన విధులపై రిటర్నింగ్ అధికారులకు అవగాహన ఉండాలని కలెక్టర్ వి.పి.గౌతమ్ అన్నారు. 10లో



పలుచోట్ల వర్షపు జల్లులు

జిల్లాలోని పలు చోట్ల శనివారం వర్షపు జల్లులు కురిశాయి. అయితే పంటలకు ప్రతికూలమని రైతులు అంటున్నారు. 10లో



వాతావరణం

జిల్లాలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే ఉంటాయి. తెల్లవారుజామున మంచు, రాత్రికి చలి ప్రభావం ఉంటుంది.

సర్వం సిద్ధం

బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు ఖమ్మం ముస్తాబైంది. ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీ జీఎన్ఆర్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించే సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరుకానున్నారు. సభను సక్సెస్ చేసే దిశగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నేతృత్వంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహిస్తున్న ఈ సభకు పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి అభ్యర్థులు కూడా రానున్నారు. భారీగా సభను సక్సెస్ చేసి గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నింపాలన్న ఆలోచనతో ఆ పార్టీ శ్రేణులు కదం తొక్కుతున్నాయి. కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో నిర్వహిస్తున్న సభకు హాజరైన తర్వాత ఖమ్మం సభకు సీఎం రానున్నారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

- నేటి ప్రజా ఆశీర్వాదానికి ఖమ్మం ముస్తాబు
- హాజరుకానున్న సీఎం కేసీఆర్
- ఏర్పాట్లు పూర్తి చేసిన గులాబీ నేతలు
- ప్రాంగణాన్ని పరిశీలించిన మంత్రి పువ్వాడ, ఎంపీ నామ


బహిరంగ సభ ఏర్పాట్ల ను పరిశీలిస్తున్న మంత్రి పువ్వాడ, ఎంపీ నామ, ఎమ్మెల్సీ తాతా మధు

భారీగా ఏర్పాట్లు..

కొత్తగూడెంలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు మధ్యాహ్నం 12 గంటలకు సీఎం కేసీఆర్ హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఖమ్మం చేరుకోనున్నారు. సర్దార్‌పటేల్ స్టేడియంలో హెలీప్యాడ్ ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణంలో 30వేలకు పైగా కుర్చీలు వేశారు. ప్రాంగణమంతా ముఖ్యమంత్రి కేసీఆర్, పువ్వాడ అజయ్‌కుమార్ కటౌట్‌లు, హోర్డింగ్‌లు పెట్టారు. ఖమ్మం నగరంతోపాటు రఘునాథపాలెం మండలాల నుంచి వచ్చే వాహనా లకు బైపాస్ రోడ్డులో పార్కింగ్ ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణంలోకి రావడానికి బైపాస్‌రోడ్డుతో పాటు టూటౌన్ పోలీస్‌స్టేషన్ వైపు వెళ్లే ద్వారాలను తెరిచారు.

ఖమ్మానికి ఏడాదిలో రెండోసారి..

కొత్త కలెక్టరేట్ ప్రారంభం, బీఆర్ఎస్ తొలి ఆవిర్భావ సభ నేపథ్యంలో ఈ ఏడాది జనవరి 18న సీఎం కేసీఆర్ ఖమ్మం వచ్చారు. ఆ తర్వాత ఈ ఏడాదిలో రెండోసారి వస్తున్నారు. అప్పుడు అధికారిక, పార్టీ కార్యక్రమాలకు రాగా, ఇప్పుడు ఎన్నికల ప్రచార సభలో పాల్గొనేందుకు వస్తుండటం, ఉమ్మడి జిల్లా కేంద్రం కావడంతో సభను విజయవంతం చేసేలా శ్రేణులు కదిలాయి. గత ఎన్నికల్లోనూ ఇదే మైదానంలో ఏర్పాటు చేసిన సభకు కేసీఆర్ హాజరయ్యారు. నాటికంటే ఎక్కువ మందిని సభకు తరలించనున్నట్లు పార్టీ నేతలు తెలిపారు.

పువ్వాడ పర్యవేక్షణ..

సభ ఏర్పాట్లన్నీ మంత్రి పువ్వాడ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఆయనతోపాటు ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. పార్కింగ్‌తోపాటు వీఐపీలు, పార్టీ శ్రేణులు, ప్రజలు కూర్చునే గ్యాలరీలను పరిశీలించి నేతలకు సూచనలు చేశారు. ఉమ్మడి జిల్లాలో గత ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గం నుంచే బీఆర్ఎస్ విజయం సాధించింది. మారిన రాజకీయ సమీకరణలతో కాంగ్రెస్, టీడీపీ నుంచి వచ్చిన ఎమ్మెల్యేలతో పార్టీ బలం పెరిగింది. ఖమ్మం సభావేదికగా గత ఎన్నికలు, బీఆర్ఎస్‌కు చేకూరిన బలం, ప్రస్తుతం చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలను సీఎం కేసీఆర్ ప్రస్తావించనున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే జిల్లా కేంద్రంలో జరగుతున్న సభకు మిగిలిన నాలుగు నియోజకవర్గాల అభ్యర్థులకూ ఆహ్వానాలు అందాయి.

ఉమ్మడి జిల్లాలో నేడు రెండు సభలు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీఎం కేసీఆర్ మొదటి విడత ప్రచారంలో పాలేరు, సత్తుపల్లి, ఇల్లెందు నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభలు పూర్తయ్యాయి. నేటితో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఐదు సభలు పూర్తవుతాయి. కొత్తగూడెంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కాగా, ఖమ్మంలో నిర్వహించే సభ కోసం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు.

ఎవరు ఎటునుంచి..

సభకు హాజరయ్యే వీవీఐపీలు సర్దార్ పటేల్ స్టేడియంలో టెన్నిస్ కోర్టు ఎంట్రన్స్ నుంచి రావాలి. వీఐపీలకు ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలోకి ప్రవేశం ఉంటుంది. ఈ మార్గంలో వైరా వైపు నుంచి వచ్చే వారు మమత క్రాస్‌రోడ్డు మీదుగా, ఖమ్మం రూరల్ నుంచి వచ్చే వారు పాత బస్టాండ్, ఇల్లెందు క్రాస్ రోడ్డు మీదుగా, రఘునాథపాలెం నుంచి వచ్చే వారు ఎన్నెస్పీ కెనాల్ బ్రిడ్జి దిగి సభకు హాజరు కావాలి. వాహనాలను కైకొండాయిగూడెం, మొగిలి పాపిరెడ్డి ఫంక్షన్‌హాల్ దగ్గర పార్కింగ్ చేసుకోవచ్చు. రాపర్తినగర్ వైపు నుంచి వచ్చే వారు ఎన్టీఆర్ సర్కిల్ దగ్గర దిగి వాహనాలను శ్రీశ్రీ సర్కిల్ వైపు పంపాలి. టేకులపల్లి బ్రిడ్జి వైపు నుంచి వచ్చేవారు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద దిగి వాహనాలను కొత్త బస్టాండ్‌వైపు పంపాలి.

విజయవంతం చేయండి : మంత్రి పువ్వాడ

ఖమ్మంలో ఆదివారం సీఎం కేసీఆర్ పాల్గొనే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాల ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సభా ప్రాంగణం వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సభకు ప్రజలు వేలాదిగా తరలిరావాలని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. తాము ఆశించిన స్థాయి కన్నా ఎక్కువ మంది సభకు తరలివస్తారనే అంచనాతో ఉన్నట్లు చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలు ఎలా విజయవంతం అవుతున్నాయో అందరికీ తెలుసని, ఈ సభ కూడా విజయవంతం అవుతుందని అన్నారు. ఈ సభ తన నియోజకవర్గంతోపాటు జిల్లాలోని ఇతర బీఆర్ఎస్ అభ్యర్థులకు కూడా ఉపయోగపడుతుందన్నారు. సీఎం కేసీఆర్ భద్రత దృష్ట్యా కళాశాల ప్రాంగణంలోని చిన్న వేదికను తొలగించామని, ఆ స్టేజిని మళ్లీ యథాప్రకారం నిర్మిస్తామని తెలిపారు. అందుకోసం రూ.లక్ష కళాశాల అకౌంట్‌లో డిపాజిట్ చేశామని చెప్పారు. అది తెలియని కొందరు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఖమ్మం చుట్టుపక్కల చాలామంది సైకోలు, పిచ్చివాళ్లు తిరుగుతున్నారని, ఎన్నికల తర్వాత వారి కోసం ఒక ఆస్పత్రి నిర్మిస్తామని, అందులో వారికి ఆధునిక వైద్యం అందిస్తామని అన్నారు. ఖమ్మంలో ఇసుక, మట్టి మాఫియా చేస్తున్నామంటున్నారని, ఖమ్మంలో అసలు ఇసుక ఎక్కడుందని ప్రశ్నించారు. గోదావరి, గంగ, కృష్ణ నదులున్నాయా..? ఉన్నది ఒక్క మున్నేరే అని, అది కూడా రాళ్లతో ఉందన్నారు. మధ్యాహ్నం 2గంటలకే ప్రజా ఆశీర్వాద సభ ఉంటుందని, ప్రజలు ఆ సమయానికే హాజరు కావాలని, 4గంటల వరకు సభ ముగుస్తుందని తెలిపారు. ఎంపీ నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ ప్రజా ఆశీ ర్వాద సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ, జిల్లా పార్టీ అధ్యక్షుడు తాతా మధు, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, బీఆర్ఎస్ జిల్లా సమన్వయకర్త ఆర్‌జేసీ కృష్ణ, నగర పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, జహీర్‌అలీ, చింతనిప్పు కృష్ణచైతన్య పాల్గొన్నారు.

21న జిల్లాకు మళ్లీ సీఎం

మధిర, వైరా నియోజకవర్గాల్లో సభలు

ఖమ్మంమయూరిసెంటర్ : బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొంటున్నారు. రెండో విడతలో ఈనెల 21న మధిర, వైరా నియోజకవర్గాల్లో జరిగే ప్రజా ఆశీర్వాద సభల్లో కేసీఆర్ పాల్గొంటారు. ఇక ఈ నెల 13న భద్రాద్రి జిల్లా దమ్మపేట, బూర్గంపాడులో సభలు నిర్వహించనున్నారు. ఇప్పటికే పాలేరు, సత్తుపల్లి, ఇల్లెందు నియోజకవర్గాల్లో నిర్వహించిన సభల్లో పాల్గొనగా ప్రజల నుంచి స్పందన వచ్చింది. ఇప్పుడు మధిర, వైరా,అశ్వారావుపేట, భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో సభలకు కేసీఆర్ షెడ్యూల్ ఖరారు కావడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది.

ఊపందుకున్న నామినేషన్లు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి రెండోరోజు శనివారం ఉమ్మడి జిల్లాలో 17 మంది అభ్యర్థులు 20 నామినేషన్లు దాఖలు చేశారు. ఖమ్మంలో 10 మంది, భద్రాద్రి జిల్లాలో ఏడుగురు నామినేషన్లు వేశారు. పాలేరులో కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తరఫున ఆయన సోదరుడు ప్రసాదరెడ్డి నామినేషన్ వేయగా, ఖమ్మంలో కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు తరఫున మరో సెట్ నామినేషన్ దాఖలైంది. పినపాకలో కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వరు నామినేషన్ వేశారు.

ఖమ్మంలో 12 నామినేషన్లు..

ఖమ్మం జిల్లా నుంచి శనివారం 10మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి కల్లూరు మండలం నారాయణపురం ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన సోదరుడు ప్రసాదరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు తరఫున గోపాల్‌రావు రెండో సెట్ నామినేషన్ వేశారు. ఖమ్మంనుంచి ఇండిపెండెంట్లుగా కె.సాయికుమార్, ఎం.శ్రీనివాసులు, పాలేరు నుంచి బి.శ్రీనివాసరావు, షేక్ సిరాజుద్దీన్, మధిర నుంచి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి కల్యాణ్ కుమార్, స్వతంత్ర అభ్యరి బొమ్మెర రామ్మూర్తి, వైరా నుంచి స్వతంత్ర అభ్యర్థిగా వర్సా రాములు, సత్తుపల్లి నుంచి అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ నుంచి అంబోజు సుమలత నామినేషన్లు దాఖలు చేశారు.

జంగ్ తెలంగాణ

అత్యంత అవినీతిపరుడు కేసీఆర్

సీఎల్పీ నేత భట్టి


యడవల్లిలో పూజలు నిర్వహిస్తున్న భట్టి విక్రమార్క

ముదిగొండ : దేశంలో అత్యంత అవినీతిపరుడు సీఎం కేసీఆర్ అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. మండలంలోని యడవల్లి, యడవల్లి లక్ష్మీపురం, దనియాలగూడెం, సీతారాంపురం, కట్టకూరు, మాధాపురం గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదట యడవల్లి శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు మేళతాళాలు, కోలాటాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభల్లో భట్టి మాట్లాడుతూ.. ప్రజల కలలను కల్లలు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో పడేసి ప్రజల గెలవాలని అన్నారు. కాంగ్రెస్ హయాంలో పేదలకు బియ్యంతో పాటు తొమ్మిది రకాల నిత్యావరస సరుకులు అందించామని, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చామని అన్నారు. బీఆర్ఎస్ కుటుంబపాలనలో దోచుకున్నదంతా కక్కిస్తామని అన్నారు. రాష్ట్ర ప్రజల అవసరాలు తీర్చడం కోసం కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వంద రోజులలో పక్కాగా అమలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు రమేష్‌బాబు, ముదిగొండ సొసైటీ డైరెక్టర్ వనం ప్రదీప్ చక్రవర్తి, నాయకులు మందరపు నాగేశ్వరరావు, కందిమళ్ల వీరబాబు, వల్లూరి భద్రారెడ్డి, ఇలవల పుల్లారెడ్డి, మట్లా బాబురాంరెడ్డి, వాక వెంకటేశ్వరరెడ్డి, పందిరి అంజయ్య, ఎండీ అజ్గర్, దేవేంద్రం, మల్లెల అజయ్, బిచ్చాల అన్వేష్, బిచ్చాల బిక్షం, ఏలూరి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిరంతర సాధన లక్ష్యాన్ని చేరువ చేస్తుంది..



మాట్లాడుతున్న న్యాయమూర్తి అర్చనాకుమారి, పక్కన సీనియర్ సివిల్ జడ్జి జావేద్‌పాషా

ఖమ్మంలీగల్: జూనియర్ న్యాయవాదులు నిరంతర సాధనతో చట్టాలను అధ్యయనం చేయడం ద్వారా లక్ష్యాన్ని చేరుకోవచ్చని కుటుంబ న్యాయస్థాన న్యాయమూర్తి అర్చనా కుమారి అన్నారు. శనివారం న్యాయసేవాసదన్‌లో జూనియర్ న్యాయవాదులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, పరిస్థితులను, వ్యక్తులను యథాతథంగా ఒప్పుకుని తమకు తాము సమయం కేటాయించుకోవాలని తెలిపారు. ఎల్లప్పుడూ చెరగని చిరునవ్వుతో కక్షిదారులకు సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయసేవాసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

బీచ్ వాలీబాల్, స్క్వాష్ జట్ల ఎంపిక



జిల్లా బీచ్‌వాలీబాల్ బాలబాలికల జట్టు

ఖమ్మం స్పోర్ట్స్ : ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పాఠశాలల క్రీడల్లో భాగంగా అండర్ 14, 17 బాలబాలికల బీచ్ వాలీబాల్, స్క్వాష్ జట్లను ఎంపిక చేశారు. డీఈఓ సోమశేఖర శర్మ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ఎంపికల్లో ఉమ్మడి జిల్లా నుంచి 40 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బీచ్ వాలీబాల్ జట్టుకు ఎంపికైన అండర్ – 17 బాలబాలికలల్లో ఎం. దినేష్, బి రూపు, డి సాయిరాం, కె. అజయ్ కుమార్, అంబికా, ప్రసన్న కుమారి, శుభాంగి, ఆకృతి, అండర్–14 విభాగంలో వి. వినయ వర్మ, జి.విష్ణువర్ధన్, టి. రఘురాం, బి. చైతన్య, అర్షద్, జి. హర్షిని, టబీ అర్షియ, బి. కీర్తన, జిల్లా అండర్ -14 స్క్వాష్ కి జట్టుకు ఎంపికైన క్రీడాకారుల్లో వి. జితేందర్, శౌందర్, కె.అనిల్ ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.నర్సింహారావు, వాలీబాల్ శిక్షకులు ఎండీ. అక్బర్ అలీ, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓపెన్ డిగ్రీ తరగతులు

ఖమ్మంసహకారనగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ తరగతులు ఈ నెల 5 (నేటి) నుంచి ప్రారంభిస్తున్నట్లు అధ్యయన కేంద్రం రీజినల్ కోఆర్డినేటర్ మహ్మద్ జకీరుల్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్వితీయ సంవత్సరం చదువుతున్న 3వ సెమిస్టర్ విద్యార్థులు, తృతీయ సంవత్సరం చదువుతున్న 5వ సెమిస్టర్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తరగతులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయని వివరించారు.

సింగరేణి కలుషిత నీటితో చేపలు మృతి

రూ.4 లక్షల మేర నష్టం

సత్తుపల్లిరూరల్: సింగరేణి కలుషిత నీటి వల్ల చేపలు మృతి చెందిన ఘటన సత్తుపల్లి మండలం రేజర్ల చెరువులో శనివారం చోటుచేసుకుంది. కిష్టారం పంచాయతీలో గల పెద్దచెరువులో మత్స్య సహాయ సహకార సంఘం ఆధ్వర్యంలో చేపలు పెంచుతున్నారు. గతేడాది ఆగస్టులో రూ.3 లక్షలతో ఆరు లక్షల చేప పిల్లలను చెరువులో పోశారు. సింగరేణి బ్లాస్టింగ్ వల్ల వచ్చిన నీరు చెరువులకు వదలటంతో చెరువులో పెంచుతున్న చేపలు మృతి చెందాయని మత్స్యకారులు వాపోయారు. సుమారు 3 టన్నుల చేపలు మృతి చెందినట్లు తెలిపారు. డిసెంబర్, జనవరిలో చేపలు పడతామని.. ఇప్పటికే 1.5 కేజీల నుంచి 3 కేజీల వరకు చేపలు పెరిగాయన్నారు. ఈ క్రమంలో కలుషిత నీటి వల్ల రూ.4 లక్షలు నష్టం వాటిల్లినట్లు సొసైటీ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు వాపోయారు.

టికెటిస్తే జోరుగా ప్రచారం చేస్తాం..

- అభ్యర్థి ఎవరో తేలకపోవడంతో తర్జనభర్జనలు
- ప్రచారంలో వెనుకంజలో ప్రతిపక్షాలు



అశ్వారావుపేట: అశ్వారావుపేట నియోజకవర్గంలో అధికార బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు బీఆర్‌ఎస్ బీ ఫామ్ ఇవ్వడంతో ప్రచారంలో జోరు పెంచారు. కొద్ది నెలలుగా కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారంటీ కార్డుల పేరుతో నియోజకవర్గంలో పోటాపోటీగా ప్రచారం చేశారు. మారుమూల గ్రామాల్లో సైతం కాంగ్రెస్ పార్టీ వాణి వినిపించారు. కర్ణాటక ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ శ్రేణుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ఆశావాహులు నాయకులు శ్రమించారు. కాంగ్రెస్ పార్టీ లో 2007 నుంచి క్రియాశీల కార్యకర్తగా మొదలుపెట్టి దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నామినేటెడ్ పదవి పొంది, ప్రస్తుత ముల్కలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలిగా కొనసాగుతున్న సున్నం నాగమణి 2018లోనే కాంగ్రెస్ పార్టీ బీఫాం కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. అప్పట్లో మహాకూటమి ఒప్పందంలో భాగంగా అశ్వారావుపేట సిగ్మెంట్ టీడీపీకి కేటాయించడంతో ఆమె నిరాశకు గురయ్యారు. కానీ, పార్టీ నిర్ణయం మేరకు మెచ్చా గెలుపుకు కృషి చేశారు. ప్రస్తుతం సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆశీస్సులతో అశ్వారావుపేట టికెట్ ఆశిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు బీఆర్‌ఎస్ నుంచి బయటకొచ్చి టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అశ్వారావుపేట తొలి ఎమ్మెల్యే వగ్గెల మిత్రసేన కుటుంబం నుంచి వచ్చి న వగ్గెల పూజ కూడా టికెట్ ఆశిస్తున్నారు. తాజాగా ఉమ్మడి ఖమ్మం జిల్లా కు చెందిన ముఖ్య నేతలు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయనతోపాటు జారే ఆదినారాయణ, తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆశావాహుల అంచనాలు తారుమారయ్యాయి.

టికెట్ కోసం ప్రదక్షిణలు..

కాంగ్రెస్ టికెట్ కోసం ఢిల్లీ మొదలుకుని పార్టీలోని సీనియర్లు, సబ్ జూనియర్ల చుట్టూ ప్రదక్షిణలు చేయడం మొదలు పెట్టారు. ఓవిధంగా చెప్పాలంటే కాంగ్రెస్ టికెట్ ఆశించే వారికంటే వారికోసం పట్టుపట్టే వారు ఢిల్లీలో ఉంటే సరిపోతుందట. కానీ, వారం రోజుల కిందటి వరకు జోరుగా ప్రచారం చేసిన ఆశావాహులు నియోజకవర్గంలో కనిపించడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత అధికార పార్టీ అభ్యర్థి ప్రచారం.. ప్రచారరథాలు చక్కర్లు కొడుతున్నా.. అప్పటిదాకా ఆరు గ్యారెంటీ కార్డులని.. చంటిపిల్లలను ఎత్తుకుని.. ముసలివాళ్లతో ముచ్చటించి.. ఇలా పరురకాల ప్రచార ఎత్తుగడను పాటించిన ఆశావాహులేమయినట్లని సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. 'మాకు టికెట్ ఇవ్వకున్నా ఫర్వాలేదు.. ఫలానా వ్యక్తికి మాత్రం ఇవ్వొద్దు' అని అధిష్టానం ఎదుట ఇద్దరు అన్నారని కొన్ని రోజుల కిందట ప్రచారం జరిగింది.

ఎవరికిచ్చినా పనిచేస్తారా?

'పార్టీ ఆదేశానుసారం టికెట్ ఎవరికిచ్చినా.. మేం పార్టీకే పనిచేస్తాం. అందరి సమన్వయంతో అశ్వారావుపేట స్థానాన్ని మొదట గెలుచుకుంటాం..' అని వేదికలపై ఉపన్యాసాలు చేసిన వారు ఇప్పుడు కనిపించడం లేదనే ప్రచారం నడుస్తోంది. నామినేషన్ దాఖలుకు ఆఖరి క్షణం వరకు తాను నమ్ముకున్న పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్తూ తనవంతు ప్రయత్నం చేస్తూనే ఆ తర్వాత రెబెల్, ఇండిపెండెట్లుగా బరిలో ఉండటం అన్నిచోట్లా సహజంగా జరిగేదే. కానీ, టికెట్ వస్తేనే ప్రచారంలోకి దిగుతాం. లేదంటే అప్పటిదాకా మిన్నకుంటాం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారా..? వారికి స్వప్రయోజనాలు తప్ప పార్టీ మనుగడ అవసరం లేదా..? హస్తం గుర్తుపై పోటీ చేసే అవకాశం కల్పిస్తేనే పార్టీకి పనిచేస్తారా..? లేకుంటే పార్టీ కోసం పనిచేయరా? అనే సందేహాలు అభిమానుల్లో కలుగుతున్నాయి. టికెట్ ఎవరికి దక్కినా.. బూత్ స్థాయి నుంచి పార్టీ ప్రచారం, ఇతర బాధ్యతలను నెరవేరుస్తామని చెబుతున్నా అందులో నిజం ఎంత ఉంటుందోనని కాంగ్రెస్ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ టికెట్ ఖరారు చేస్తే ప్రచారంలో దూసుకుపోతామని ఆశావహులు సైతం చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

జంగ్ తెలంగాణ

రూ.1.43 లక్షల నగదు పట్టివేత

ఖమ్మంక్రైం: నగరంలోని నయాబజార్ ప్రాంతంలో ద్విచక్రవాహనంలో డబ్బులు తీసుకొని వెళ్తున్న వ్యక్తిని ఆపి సోదా చేయగా రూ.1.43 లక్షలు నగదు దొరికింది. ఆధారాలు చూపకపోవడంతో నగదు సీజ్ చేశామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

మద్యం పట్టివేత

ఖమ్మంక్రైం: ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో ఎక్సైజ్ స్టేషన్-1 సీఐ రాజు ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుబడింది. ముగ్గురు వ్యక్తుల నుంచి 26 ఫుల్ బాటిళ్లు, 114 క్వార్టర్ బాటిళ్లు, 11 బీర్ బాటిళ్లతోపాటు రవాణాకు ఉపయోగిస్తున్న స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.75 వేలు ఉంటుందని సీఐ రాజు తెలిపారు. మద్యం, గంజాయి, గడుంబా, నల్లబెల్లం, ఇతర మాదకద్రవ్యాల రవాణా, నిల్వ గురించి సమాచారం తెలిస్తే వెంటనే 87126 58841, టోల్‌ఫ్రీ నంబర్ 1800–425–2523 కు తెలియజేయాలని సీఐ కోరారు.

అధికారులకు పూర్తి అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వీపి గౌతమ్

ఖమ్మంసహకారనగర్: పోలింగ్ రోజున నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలపై ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ విధులు, బాధ్యతల పట్ల అసెంబ్లీస్థాయి మాస్టర్ శిక్షకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ రోజున నిర్వహించే విధుల పట్ల, ఈవీఎం యంత్రాల పట్ల పూర్తి అవగాహన పొందాలన్నారు. పోలింగ్ ఏజెంట్లకు సీక్రెట్ ఓటింగ్, పోలింగ్ నియమాలపై వివరించాలని, పోలింగ్ ప్రారంభానికి 90 నిమిషాల ముందు మాక్ పోలింగ్ నిర్వహించే విధానంపై వారికి వివరించాలని, పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ జరపాలని పేర్కొన్నారు. మాక్ పోలింగ్‌లో 50కి తక్కువ కాకుండా ఓట్లు వేయాలని, రిజల్ట్ చూసిన తర్వాత ఈవీఎం యంత్రాన్ని క్లియర్ చేయాలని, అనంతరం అసలైన పోలింగుకు సన్నద్ధం కావాలని వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, శిక్షణ నోడల్ అధికారిణి విజయనిర్మల, జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్ కె.శ్రీరామ్, మదన్‌గోపాల్, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

సర్వేలన్నీ కాంగ్రెస్‌కే అనుకూలం

- బీఆర్‌ఎస్‌కు 20 నుంచి 25 సీట్లు కష్టమే
- మాజీ మంత్రి తుమ్మల, పాలేరు అభ్యర్థి పొంగులేటి



అభివాదం చేస్తున్న తుమ్మల, పొంగులేటి

నేలకొండపల్లి: ఎన్నికల్లో సర్వేలన్నీ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక శ్రీ సీతారామ ఫంక్షన్‌హాల్లో శనివారం బూత్ స్థాయి సభ్యుల సమావేశం నిర్వహించగా వారు పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ ఎన్ని సర్వేలు చేయించినా చివరకు ఆయన సొంత సర్వేలో కూడా కాంగ్రెస్ గాలి వీచటంతో పాలుపోని పరిస్థితిలో ఉన్నాడన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు 20 నుంచి 25 వరకు రావటం కష్టంగా ఉన్నట్లు సర్వేలో తేలిందని స్పష్టం చేశారు. కోట్లు ఖర్చు పెట్టినా గెలిచేది కాంగ్రెస్ అని.. అధికారంలోకి రావటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పాలేరు, ఖమ్మంలో ఎంత డబ్బు అయినా పంపి మమ్మల్ని ఓడించాలని సీఎం కేసీఆర్ చూస్తున్నాడని, వాళ్ల అహంకారానికి, అధికార మదానికి కాంగ్రెస్ కార్యకర్తలు ఫుల్‌స్టాప్ పెట్టే సమయం వచ్చిందని చెప్పారు. ఖమ్మం, పాలేరు రెండు నియోజకవర్గాలు కాదని.. ఒక్కటేనని వారు తెలిపారు. సమావేశంలో బాలసాని లక్ష్మీనారాయణ, రాయల నాగేశ్వరరావు, వెనికె జానకీరామయ్య, శాఖమూరి రమేశ్, నెల్లూరి భద్రయ్య, మామిడి వెంకన్న, కుక్కల హనుమంతరావు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల సత్యనారాయణ, కోనేరు కిశోర్, కడియాల నరేశ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఓటు కీలకంగానే భావించాలి

కూసుమంచి: ప్రతి ఓటు కీలకమేనని, ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేసేలా బూత్ కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం మండలంలోని పాలేరు బీవీ రెడ్డి ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన బూత్ స్థాయి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు 23 రోజులు సమయం ఉన్నందున ఓపిక చేసుకుని కష్టపడితే ఇందిరమ్మ రాజ్యం వస్తుందన్నారు. బూత్ కమిటీల సభ్యులు వృద్ధులు, దివ్యాంగుల ఓట్లు పడేలా దృష్టి సారించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చేపట్టేబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రచారాన్ని విస్తృతం చేయాని సూచించారు.

రాజకీయ ప్రయోజనాలతో వచ్చేవారికి చెక్ పెట్టాలి

- నేను లోకల్ బిడ్డను.. నాకే ప్రజా మద్దతు ఉంది: కందాల
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో కలిసి విలేకరుల సమావేశం



మాట్లాడుతున్న కందాల ఉపేందర్‌రెడ్డి పక్కన తాతా మధు

ఖమ్మంరూరల్: రాజకీయ ప్రయోజనాల కోసం పాలేరు నియోజకవర్గానికి టూరిస్టులుగా వచ్చి పోయే నాయకులకు పాలేరు ప్రజలు చరమగీతం పాడటానికి సిద్ధంగా ఉన్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. శనివారం మండలంలోని సాయిగణేశ్‌నగర్‌లోని ఎమ్మెల్యే కందాల క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో తొలుత తాతా మధు మాట్లాడారు.. కొత్తగూడెం నియోజకవర్గంలో పోటీ చేస్తానంటూ ఆశలు చూపి ఆ పార్టీ నాయకులను గందరగోళంలోకి నెట్టి, కొత్తగూడెం నియోజకవర్గాన్ని విడిచి తన ధనబలంతో పాలేరు ప్రజలను కొందామని చూస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. పాలేరులో పోటీ చేస్తానని, పాలేరు ప్రజలకు పెద్ద పాలేరుగా అందుబాటులో ఉండి గోదావరి నీళ్లతో ప్రజల కాళ్లు కడుగుతానని ప్రగల్భాలు పలికిన తుమ్మల నాగేశ్వరారావు తన రాజకీయ అవసరాల కోసం పాలేరును విడిచి వేరే నియోజకవర్గానికి వెళ్లాడని తెలిపారు. ఆర్థిక, ధనబలంతో విర్రవీగుతున్న స్థానికేతరులకు సమాధానంగా పాలేరు గడ్డపై పుట్టిన స్థానికుడు కందాల ఉపేందర్‌రెడ్డిని గెలిపించుకోవాలని తెలిపారు. ఎమ్మెల్యే కందాల మాట్లాడుతూ.. తాను గెలిచిన నాటి నుంచి నేటి వరకు రాజకీయాలకతీతంగా కులమతాలకు తావులేకుండా ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేశానని తెలిపారు. కాగా, పాలేరు నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త లుగా మాజీ ఎమ్మెల్యే బాణోత్ చంద్రావతి, తాళ్లూరి జీవన్‌కుమార్, నల్లమల వెంకటేశ్వరరావు, కృష్ణమూర్తిని నియమించినట్లు తాతా మధు తెలిపారు. సమావేశంలో ఎంపీ నామా నాగేశ్వరరావు, తాళ్లూరి జీవన్‌కుమార్, నాలుగు మండలాల బీఆర్‌ఎస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీ టీమ్‌లను ఓడించండి

ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రంగారావు



ఖమ్మంలో మాట్లాడుతున్న పోటు రంగారావు, పక్కన గుమ్మడి నర్సయ్య, రాయల చంద్రశేఖర్

ఖమ్మంమయూరిసెంటర్ /సత్తుపల్లి : ప్రస్తుతం ఐదు రాష్ట్రాల్లో జరగబోయే ఎన్నికల ఫలితాలు రాబోయే లోక్‌సభ ఎన్నికలను ప్రభావితం చేస్తాయని, అందుకే ఈ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని, దానికి బీ టీమ్‌లుగా వ్యవహరిస్తున్న బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలను ఓడించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మం పార్టీ కార్యాలయంలో విలేకరులతో, సత్తుపల్లిలో జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. నేడు దేశం పెను ప్రమాదంలో ఉందన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామిక ఆకాంక్షలను తుంగలో తొక్కుతూ, నిరంకుశ పాలన సాగుతోందని అన్నారు. బీజేపీకి బీఆర్‌ఎస్ బీ టీమ్‌గా మారిందని, మ్యాచ్ ఫిక్సింగ్‌తో రాజకీయ క్రీడ కొనసాగిస్తోందని ఆరోపించారు. పోస్ట్ ఎలక్షన్ ఒప్పందంతో, పరస్పర అవగాహనతో సాగుతోందన్నారు. ఎంఐఎం కూడా మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ దేశంలో బీజేపీకి తోడు సంస్థగా మారిందని విమర్శించారు. ఎన్నికల్లో ఆ పార్టీలను ఓడించడమే లక్ష్యంగా ప్రజాపంథా పని చేస్తుందన్నారు. ప్రజాపంథా పోటీ చేసే మూడు స్థానాల్లో, ఇల్లెందులో స్వతంత్ర అభ్యర్థి గెలుపునకు ప్రచారం చేస్తూనే, తమ పార్టీ పోటీ చేయని నియోజకవర్గాల్లో బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎంలను ఓడించేందుకు ప్రచారం చేస్తామని తెలిపారు. ఉపా చట్టం రద్దు చేయాలని, ఉద్యోగ ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, రైతులకు రుణమాఫీ చేయాలని, పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలనే నినాదాలతో ఎన్నికల ప్రచారం చేస్తామన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టుపై కేంద్ర జల సంఘం ఇచ్చిన నివేదికకు కేసీఆర్ ప్రభుత్వం, అధికారులు సమాధానం చెప్పాలని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కెచ్చెల రంగారెడ్డి, గుమ్మడి నర్సయ్య, రాయల చంద్రశేఖర్, గోకినేపల్లి వెంకటేశ్వర్లు, గుర్రం అచ్చయ్య, సీవై పుల్లయ్య, ఆవుల అశోక్, గంటా శ్రీనివాసరావు, జి.లలిత పాల్గొన్నారు.

పలుచోట్ల వర్షపు జల్లులు

- పత్తి, వరి పంటలకు ప్రతికూలం
- కోత దశలో ఉన్న వరి రైతుల్లో ఆందోళన

ఖమ్మంవ్యవసాయం: వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. శనివారం సాయంత్రం జిల్లాలో అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. ఖమ్మం నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో వర్షపు జల్లులు పలకరించాయి. చలికాలం అయినప్పటికీ వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవటం, పగటి ఉష్ణోగ్రతల కారణంగా ఉక్కపోతలు ఉంటున్నాయి. అదే రాత్రి సమయంలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా రెండు, మూడు రోజులుగా జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కూడా కురిసింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు 29 నుంచి 36 డిగ్రీ సెంటీగ్రేడ్ వరకు నమోదవుతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు 16 నుంచి 24 డిగ్రీ సెంటీగ్రేడ్ వరకు నమోదవుతున్నాయి. కాగా, ఈ ఏడాది ఆశించిన వర్షాలు కురవలేదు. మొత్తంగా సీజన్‌లో లోటు వర్షపాతం నమోదైంది. దీంతో పంటల సాగు విస్తీర్ణం సాధారణం కన్నా కొంతమేర తగ్గింది. జిల్లాలో పత్తి, వరి పంటలు చేతికందుతున్నాయి. పత్తి తీతలు కొనసాగుతున్నాయి. బెట్ట పరిస్థితులను ఎదుర్కొని అరకొరగా చేతికందుతున్న పత్తికి ఈ వానలు ప్రతికూలంగా మారనున్నాయి. కనీస మద్దతు ధర పొందలేని ప్రస్తుత స్థితిలో వానలు పడితే నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని, ధర మరింతగా క్షీణించే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి పొట్ట, ఈనిక, కోత దశల్లో ఉంది. ముందుగా వేసిన వరి కోత దశలో ఉండగా వాతావరణం ప్రతికూలంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. సత్తుపల్లి, కూసుమంచి వ్యవసాయ డివిజన్లలో వరిని ముందస్తుగా సాగుచేయగా కోత దశకు చేరుకుంటోంది. పలుచోట్ల ఈదురుగాలుల కారణంగా వరి నేలవాలింది. పంట నాణ్యత కోల్పోయే ప్రమాదం ఉంది. పలు పంటలు సాగు చేసి రెండు నెలలుగా వానలు లేక బెట్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. పలు పంటలకు నీటి తడుల అవసరం ఉంది. ఆయా పంటల రైతులు వానల కోం ఎదురుచూస్తున్నారు.